

కారు పార్క్ చేసి బ్రీఫ్‌కేస్ తీసుకొని రిస్టువాచ్‌లో టైం చూసుకుని ఓ పదినిముషాలు ఆలస్యం అయిపోయినందుకు మధనపడుతూ చకచకా ఆఫీసులోకి వచ్చాను.

సిబ్బంది అప్పుడే తమ సీట్లలో సెటిల్. అవుతూ నన్ను చూసి విష్‌చేసిమళ్ళీ తమ సీట్లలో సర్దుకుని కూర్చున్నారు.

నేను కూడా గుడ్‌మార్నింగ్, గుడ్ మార్నింగ్ అంటూనే నా గదిని సమీపించాను.

అటెండర్ వినయంగా నాకు సలామ్ కొట్టి బ్రీఫ్‌కేస్ అందుకుని స్ప్రింగ్ డోర్ తెరిచాడు. నేను లోపలికి వెళ్ళి సీట్లో కూచున్నాను.

అటెండరు బ్రీఫ్‌కేసును పక్కన టేబుల్ మీద పెట్టి గ్లాసుతో మంచి నీళ్ళు తెచ్చి నాకందిస్తూ

"అమ్మగారు రెండు సార్లు ఫోన్ చేశారండి" అన్నాడు.

నాకు పక్కలో బాంబు పేలినట్టు అయింది.

ఇంట్లోంచి బయలుదేరి తిన్నగా ఆఫీసుకే వస్తున్నాను మరి.

ఎంత కారులో వచ్చినా ఇందుకు నాకు కనీసం ముప్పావుగంట అయినా పడుతుంది. కారణం భాగ్యనగరం రోడ్ల భాగ్యం అలాంటిది— గతుకులూ డ్రైనేజి కాలువలు, త్రవ్వకాలు, నన్నే ట్రాఫిక్కులు, ట్రాఫిక్ రూల్సు బొత్తిగా ఖాతరు చెయ్యకుండా వెళ్ళే వాహనాలు. ట్రాఫిక్ జాంలూ వగైరా వగైరాలను అధిగమించి కారు నడపడానికి నేర్పూ ఓర్పూ కూడా అవసరం— బ్రహ్మవిద్య అనేది ఏదేనా ఉంటే అది ఇక్కడ కొన్ని రోడ్ల మీద కారు నడపగలగడమే— ఇంతటి కల్లోలంలో మా కారు నడిపే శక్తి స్థిత ప్రజ్ఞుడిలా నిర్వికారంగా ఉండగలగాలి—

ఈ పాట్లన్నీ బహుశా భారతికి తెలిసివుండనా — ఇంటి దగ్గర బయలుదేరిన కారు అమాంతంగా కీలుగుర్రంలా ఆఫీసు ఆవరణలో వాలి ఉంటుందన్న ఉద్దేశంతో ఈ వ్యవధిలో అప్పుడే రెండు సార్లు ఫోన్ చేసిందంటే ఏదో—

మరీ అవసరమైతే తప్ప మాటి మాటికీ ఆఫీసుకు ఫోన్ చెయ్యకు అని హెచ్చరించి ఉన్నాను గనుక ఇదేదో అర్జంటు బాపతే అయివుంటుందని వెంటనే ఫోన్ అందుకుని ఇంటి నంబరు కలిపాను.

నా కాల్ కోసం ఫోన్ దగ్గరే కూర్చుందేమో. వెంటనే రిసీవర్ ఎత్తి "ఏమండీ మీరేనా" అంది.

"అవును భారతీ. ఏమిటి సంగతి"

"మీరు తక్షణం ఇంటికి రావాలండీ.."

"ఏం నీకు ఒంట్లో ఏమైనా—" అడిగాను ఆదుర్దాగా

"అబ్బ అది కాదండీ...

"మరి బాబు..."

ఈ సారి భారతి కంఠంలో విసుగు ధ్వనించింది.

"నేనూ బాబూ బాగానే ఉన్నామండీ అసలు సంగతి టెలిగ్రాం వచ్చింది". టెలిగ్రాం అనగానే నా మనసెందుకో కీడును శంకించింది. ఒంట్లో బాగుండడం లేదని ఉత్తరం వస్తే పదిరోజుల క్రితమే వెళ్ళి మా నాన్నను చూసి వచ్చాను. వయసు మీద పడడం మూల కారణమైనా— మనిషి చాలా డీలా పడిపోయి ఉన్నారు. బిపి కాస్త ఎక్కువై.. మనిషిని కంగారు పెట్టింది. బెడ్ రెస్ట్ అవసరం అన్నారు డాక్టర్లు. నేను మూడు రోజులే శెలవు పెట్టి వెళ్ళాను. ఆ స్థితిలో నాన్నను వదిలి రావడానికి సంశయిస్తూ ఉంటే.

"నీవు వెళ్ళిరా ఫర్వాలేదు. ఈ కట్టె ఎప్పుడో అప్పుడు రాలిపోవలసిందే. నా కింకేం కావాలి.చిన్న దాని పెళ్ళి జరిపించేశావు అదే పదివేలు" అంటూ నన్ను సాగనంపాడు.


"టెలిగ్రాం అంటే నాన్న..."

భారతిలో మళ్లీ విసుగు.

"అబ్బా. మీ నాన్న క్షేమంగానే ఉన్నారండి. ఈ తంతి మా కజిన్ ఇచ్చింది. మీరు బయలుదేరి అటు వెళ్ళగానే వచ్చింది."

మనసు కాస్త కుదుటపడ్డా, ఈ కజిన్ అన్న మాట నాకు కుతూహలాన్ని రేకెత్తించింది.

'కజిన్. అన్నది కామన్




భర్తతో అంది భార్య.

"ఏమండి అప్పులవాళ్ళు ప్రతిరోజూ మన ఇంటి చుట్టూ తిరుగుతున్నారు"

"తిరిగితే తిరిగారుగాని ఆ చీరపాదులు అవీ తొక్కకుండా తిరగమను."

కె.వి.మధుసూదనరావు, కాకినాడ

## పి.వి.కృష్ణమూర్తి

జెండర్. ఆడా మగా'

"విషయం ఏమిటో చెప్పనివ్వకుండా ఏమిటం డీ ఆమాటలు మా పిన్ని కొడుకు రఘునందన్. వైజాగ్ నుండి బాంబే ప్లేనులో వెళుతున్నాడు.

"ఆ హా"

"హైదరాబాద్ ఏర్‌పోర్టులో మనల్ని కలుసుకో వాలని" తంతి ఇచ్చాడు.

నేను కాస్త ఆలోచనలో పడ్డాను. భారతి బంధు వర్గంలో వ్యక్తులు నాకు పెళ్ళిలో పరిచయమైన వారే. తర్వాత వాళ్ళను చూసే సందర్భం నాకు కలుగనే లేదు. నాలో సదరు రఘునందన్ అన్న వ్యక్తిని చూడ్డంగానీ, పేరు వినడంగానీ నాకు గుర్తుకు రావడం లేదు.

"ఏమండీ నేను చెప్పేది వినబడుతుందా"

"ఆ ఆ ఆటో చేసుకుని వెళ్ళి చూసిరా. ఈ మాత్రం భాగ్యానికి నాకు ఫోన్ చెయ్యాలా"

"మీ కేమన్నామతిపోయిందా. టెలిగ్రాం చదువుతాను వినండి. ప్రొసీడింగ్ టు స్టేట్స్ స్టాప్. హాల్టింగ్ ఫ్యూ మినిట్స్ హైదరాబాద్ ఏర్‌పోర్ట్ ఎన్‌రూట్ బాంబే. స్టాప్ రిక్వెస్ట్ మీట్ అలాంగ్ విత్ బావగారు. రఘు— ఇప్పుడైనా అర్థమైందా అండీ."

"అర్థమైందిగానీ నేను రావడం అవసరం అంటావా"

"అవసరం కాబట్టే ఫోన్ చేస్తున్నాను. భార్యను తీసుకుని అమెరికాకు వెళుతున్నాడు. మీరతని పెళ్ళికి రాలేదుగదా. మిమ్మల్ని చూడాల న్న కోరికతో తంతి ఇచ్చాడు మరి..."

"అతని పెళ్ళి సంగతి నాకు తెలియనే తెలియదుగా"

"అవున్లెండి— బాబు బారసాలకని మీరప్పుడే మా ఊరు వచ్చి వెళ్ళారు— తరువాత వారానికి ఇతని పెళ్ళికుదరడం వెంటనే ముహూర్తం పెట్టుకోడం అంతా హడావుడిగా జరిగిపోయిం ది."

"సరే— కానీ భారతీ"

"చూడండీ ప్లేను పన్నెండున్నరకి దిగుతుంద ట— మీరు వాళ్ళను చూశాక తిరిగి ఆఫీసుకు వెళ్ళిపోవచ్చు— ఇప్పుడు మీరు త్వరగా ఇంటికి రండి. కాస్త బజారు పనివుంది'

"ఏం పని"

"వాళ్ళకేదైనా ఖరీదైన ప్రెజెంటేషన్ కొనా లి"

"ఏ మాత్రం ఖరీదులో".

"కనీసం రెండు వేలైనా..."

"నా దగ్గరి అంత బాలెన్స్ ఉండదేమో భారతీ..."

"మీ డబ్బేమీ ఖర్చు పెట్టనక్కర్లేదులెండి. మావాళ్ళకు నాకు తోచింది ఇస్తాను— మీరు వెంట ఉండండి చాలు. మీరు వస్తే కోఠీ ఆంధ్రాబ్యాంకులో మనీ డ్రా చేసుకుని అలాగే బజారు వెళ్ళి ఏర్‌పోర్ట్‌కి వెళదాం."

ఇంక తప్పదు.

"అయితే భారతీ నువ్వు ఆటో చేసుకుని తిన్నగా కోఠీకి వెళ్ళిపో. నేను మా యండిగారు వచ్చాక చెప్పి కోఠీలో నిన్ను పికప్ చేసుకుంటా ను."

"తప్పకుండా రావాలి" అంటూ ఫోన్ పెట్టేసింది.

టైం చూసుకున్నాను. ఇంకా పదీ పదే. యండి పదిన్నరకు సరిగ్గా వస్తాడు. ఈ ఇరవై నిముషాలూ బరువుగా గడపక తప్పదు నాకు.

మనసంతా కలకబారిపోయింది. కారణం భారతి "మీ డబ్బేమీ ఖర్చు పెట్టనక్కరలేదు లెండి మా వాళ్ళకు ... " అని అన్నమాటలే.

డబ్బు ప్రసక్తి వచ్చినప్పుడల్లా భారతి ఇలా చెప్పడం పరిపాటే. దానితో పాటు నేను ఇలా బాధపడడమూ పరిపాటే.

నేనూ మా వారూ డబ్బు కాపీనం మనుషులమనీ. కేవలం కట్నం కోసమే ఆమె మెళ్ళో నేను తాళిగట్టాననీ ఆమె అభిప్రాయం.

కాపీనం మాట ఎట్లా ఉన్నా కట్నం కోసం కట్టిన మాట మాత్రం నిజమే. అప్రయత్నంగా నా ఆలోచనలు గతంలోకి వెళ్ళినై.

కట్నం— కట్నం.

ఈ పిశాచం అడ్డుపడబట్టిగానీ లేకపోతే నా పెళ్ళి నిజానికి నీరజతోనే జరగవలసింది.


నేను మా కంపెనీ విజయవాడ సబ్ఆఫీసులో పనిచేస్తున్న రోజులని నాకు సంగీతం మీద ఆసక్తి వుంది. శ్రావ్యమైన కంఠమూ ఉంది. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో అప్పుడప్పుడూ లలిత సంగీతం పాడే అవకాశం ఇస్తూ ఉండేవారు.


నీరజ కూడా తరచూ రేడియోలో ప్రోగ్రా ములు ఇస్తూ ఉండేది. ఆమెకు శాస్త్రీయ సంగీతలోను— లలిత సంగీతంలోనూ చక్కని ప్రవేశం వుంది. ఆమె గాత్రం కూడా ఆపాతమధురమైన శ్రోతలను ఏదో రసమయ జగత్తులోకి తీసుకువెళ్ళే సమ్మోహనశక్తి గలిగింది.

ఒకసారి ఆకాశవాణి వారు ఏర్పాటుచేసిన యుగళగీత కార్యక్రమంలో నీరజకూ నాకూ అవకాశం ఇచ్చారు. అప్పుడే మా కిద్దరికీ పరిచయం ఏర్పడింది.

ఆ ప్రోగ్రాం శ్రోతలను బాగా ఆకట్టుకోడం తో మా జంటకు యుగళ గీతాలు పాడే అవకాశాలు తరచూ రాసాగినై. ఊళ్ళోనూ ఇతర సాంస్కృతిక సంస్థలు ఏర్పాటుచేసే సంగీత కార్యక్రమాల్లో కూడా మేం పాలు తీసుకోవడంతో మా జంట చాలా పాపులర్ అయిపోయింది.

మేం సాధారణంగా కలుసుకునేది ప్రోగ్రాము లు ఉన్నపుడో లేక కొత్త పాటలు రిహార్సల్స్ చేయవలసివచ్చినపుడో కానీ నా మనసు నాకు





తెలియకుండానే నీరజ పట్ల ఆకర్షితమౌతూ వస్తున్నది.

ఆమె కంఠం ఎంత మధురమైందో రూపం కూడా అంత ఆకర్షణీయమైందే.

ఆమె అలంకరణ ఆంధ్ర సాంప్రదాయానికి కట్టుబడింది.

వినయం, విధేయత తెలుగింటి ఆడపడుచుల ప్రతీక.

ఆమె ఇంగ్లీషులో మాట్లాడినప్పుడు తప్ప ఆమె గ్రాడ్యుయేట్ అని ఎవరూ అనుకోరు. ఆమె రాగ ప్రస్తారంలో న్యాసాలు వింగడించినప్పుడు తప్ప శాస్త్రీయ సంగీతంలో ఆమె కంత అభినివేశం ఉన్నదని ఎవరూ అనుకోరు.

చూపుల్లో అమాయకతా, చిరునవ్వులో స్వచ్ఛత ఎవరికైనా సరే ఆమెను మరో సారి చూడాలన్న ఆసక్తిని కలిగిస్తాయి.

అటువంటి నీరజ నన్ను సూదంటురాయిలా ఆకర్షించిందనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. కానీ చాలా రోజులు మా పరిచయం ప్రోగ్రాం సందర్భంలో కలుసుకోవడం వరకే పరిమితమై ఉండేది— దానికి తోడు ఆమె మితభాషిణికూడా కావడంతో ఆమె స్వవిషయాలు తెలుసుకునే అవకాశం ఉండలేదు. మాటల సందర్భంలో అప్పుడప్పుడూ బయటపడ్డ విషయాలు—

ఆమె తండ్రి పేరు వాసుదేవరావు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం. నీరజకు ఒక అక్క మాత్రం ఉన్నది. ఆమెకు పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. తండ్రి ఉద్యోగ రీత్యా వాళ్ళు చాలా ఊళ్ళు తిరిగి నీరజ మెట్రిక్ అయ్యే సరికి విజయవాడ బదిలీ అయింది. రిటైర్‌మెంట్ దగ్గర పడుతుండడంతో ఇంక బదిలీల ప్రసక్తిలేక అక్కడే స్థిరపడ్డారు. నీరజ బికాం పూర్తిచేసింది. ఉద్యోగం మీద ఆసక్తిలేక ఇలా సంగీత ప్రోగ్రాంలు ఇవ్వడం పిల్లలకు ట్యూషన్లు చెప్పడం చేస్తూ ఉంది.

ఆమెను పెళ్ళి చేసుకోవాలన్న కోరిక నాలో క్రమంగా అధికం కావడం మొదలు పెట్టింది. కానీ ఆమెకు నామీద ఎటువంటి అభిప్రాయం ఉన్నదో నాకు తెలియదు.

స్త్రీల అంతర్యాన్ని బయటకు లాగడం కష్టమే. కానీ నాకామె కావాలంటే ఈ విషయంలో నేను సాహసం చెయ్యక తప్పదు.

ఒకసారి ఆకాశవాణి రికార్డింగ్ సందర్భంలో ఇద్దరూ కలిశాం. అరగంట పాటు కరెంటు పోవడంతో మేం ఇవతలికి వచ్చి ఆవరణలో లాన్‌లో కూర్చున్నాం.



ఆమె సన్నగా ట్యూన్ హమ్ చేస్తూవుంది.

ఈ ఏకాంతం మళ్ళీ దుర్లభం. అవకాశం జారవిడుచుకోకూడదు. మనసు ఏదో నిశ్చయాని కి వచ్చింది.

"మీరు చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటారు" అన్నాను.

ఆమె చిన్నగా నవ్వింది.

"మీతో అలా ఎప్పుడూ ప్రవర్తించలేదే" అంది.

"అవుననుకోండి. కానీ మిమ్మల్ని ఏ విషయ మైనా అడగాలంటే నాకే ఎందుకో జంకుగా ఉంటుంది."

"అందుకు నేను బాధ్యురాలిని కాదుగదా— సరే ఏం అడగదలచినారు మీరు. నిస్సంకోచంగా అడగొచ్చు— ఇంక్లూడింగ్ మేరేజ్—

ఆ మాటతో నేను ఉలిక్కిపడ్డాను. నా మనసులో భావాన్ని కళ్లల్లో చూసిందేమో.

"మారేజ్ విషయం ఎందుకు ఇంక్లూడ్ చేస్తున్నారు."

"నాతో మాట్లడే వాళ్ళకు చాలా మందికి ఆ క్యూరియాసిటీ ఉండడం గమనించాను. మీరింత చదువుకున్నారు. చక్కగా ఉంటారు. బాగా పాడుతారు అయినా మరెందుకింకా పెళ్ళిచేసుకో లేదూ అని ప్రశ్నిస్తుంటారు. మీరూ అలానే అడుగుతారేమోనని."

"అలాగా అయితే అలా అడిగిన వారికి మీరేం సమాధానం ఇచ్చేవారు".

"తగిన మొగుడు దొరక్క" అంటూ కిలకిలా నవ్వింది.

ఈ మాటలతో నాకు మరింత ధైర్యం వచ్చింది.

"అయితే. ఈ విషయంలో నా మీద మీ అభిప్రాయం చెప్పగలరా" అడిగేశాను.

కొన్ని క్షణాలు నా వంక ఆశ్చర్యంగా చూసింది.

"అంటే... మీకు..."

"అవును నీరజా..."

అప్రయత్నంగా ఆమె కళ్ళు దించుకుంది.

"మౌనం అంగీకార సూచకమా" అడిగాను కుతూహలంగా.

"క్షమించండి— నేను. ఇరువైపుల పెద్దలు అంగీకరించిన పెళ్ళినే ఇష్టపడతాను. అడ్రసు ఇస్తాను. వచ్చి మా అమ్మా నాన్నలతో మాట్లాడండి" అంది.

"థాంక్యూ నీరజా. ఈ ఆదివారం ఇంటికి వస్తాను"

ఆ ఆదివారం నీరజ ఇంటికి వెళ్ళాను. ఆమె తండ్రి వాసుదేవరావు తల్లి జానకమ్మ, ఎంతో ఆదరణతో మాట్లాడారు.

"మీ పెద్దలు కూడా అంగీకరిస్తే మా అభ్యంతరం ఏమీ లేదు బాబూ మంచి రోజు చూసుకుని మీ ఊరు వస్తాను" అన్నారు వాసుదవరావు.

ఆయన కోరినట్టుగానే వాసుదేవరావును మా ఊరికి తీసుకువెళ్ళాను. మా నాన్నకూ, అమ్మకూ పరిచయం చేసి విషయం టూకీగా చెప్పి తక్కిన వివరాలు వాళ్ళు మాట్లాడుకోడానికి అవకాశం కల్పించి నేను నా గదిలోకి వచ్చి కూర్చున్నాను.

అరగంట గడిచాక వాసుదేవరావు తలదించుకుని బయటకు వెళ్ళడం గమనించి గుండెలమీద బండపడ్డట్టయి ఆయన వెంట వెళ్ళి "మేష్టారూ" అన్నాను.

ఆయన నన్నదోలా చూశాడు. ఆ చూపులో ఏవగింపు ఉంది.

"మా నీరజను మరిచిపో బాబూ" అంటూ ముందుకు నడిచాడు.

"ఏం జరిగిందండీ? మా వాళ్ళేమన్నారు."

"నీకు కట్నం తీసుకునే ఉద్దేశ్యం ఉంటే మాతో అప్పుడే చెప్పి ఉండవలసింది, అడిగినా పదో పన్నెండో ఫర్వాలేదుగానీ ఏకంగా యాభైవే లంటే ఎక్కణ్ణించి తేగలం— ఇంత పేరాశ పనికిరాదయ్యా— ఆడపిల్లల్ని కన్నవాళ్ళ కంఠాల్ని తడిగుడ్డతో కత్తిరించడమే...వస్తాను" అంటూ ఆయన చకచకా వెళ్ళిపోయారు.

నేను పిడుగు మొత్తిన స్తబ్దత్వంలో పడిపోయి ఆయన అలా వెళ్ళిపోతూ ఉంటే గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయాను.

మా నాన్నగారి మీద నాకు విపరీతమైన కోపం వచ్చింది. కానీ ఆ కోపాన్ని మా నాన్న మీదగానీ అమ్మామీదగానీ ఏ విధంగానూ చూపించలేకపో యాను.

మా చెల్లెలు సుశీలకు సంబంధాలు చూస్తున్నా రు. సుశీలకు రూపం— తక్కువ చదువూ

తక్కువే. కానీ ఆడపిల్లకావడంచేత ఏదో విధంగా దానిమెడలో తాళికట్టించి అత్తవారింటికి పంపించాలి కానీ వస్తున్న సంబంధాలన్నీ కట్నం బేరం కుదరక ఆగిపోతున్నాయి. నలభై వేలదాకా అడుగుతున్నారు. మా నాన్న అంతకు తూగలేదు నన్ను బేరం పెడితే తప్ప లాభం ఉండదన్న నిశ్చయానికి వచ్చాడు మా నాన్న.

"నీకు కనీసం యాభైవేలు వస్తే తప్ప సుశీల పెళ్ళిచెయ్యలేం. అందుకనే అడిగాను ఆయనంత ఇచ్చుకోలేనప్పుడు మరో సంబంధం చూద్దాం"

కానీ మనసునిండా నీరజను నింపుకున్న నేను మరో పిల్లను ఎలా పెళ్ళాడగలను.

"నాన్నా నేను అమ్మాయిని మనసారా ప్రేమించాను. కావలిస్తే ఇల్లో పొలమో అమ్మైనా సుశీల పెళ్ళి చేయండి కానీ నన్ను మాత్రం కట్నానికి అమ్ముకోకండి"

మా కున్నది పూర్వీకమైన చిన్న డాబా ఇల్లు. మా అమ్మ పసుపుకుంకుమ పేరిట ఉన్న రెండెకరాల మాగాణి. మా నాన్న లోకల్ ఫండ్ ఆఫీసులో పనిచేసి రిటైర్ అయిపోయాడు. నన్ను పెద్ద చదువు చదివించడానికి కాస్త శ్రమే పడ్డారులెండి.

నా మాట విని మా నాన్న నరసింహావతారం ఎత్తాడు.

"నువ్వు ప్రేమించిన దాన్ని కట్టుకుని కులుకుతూ ఉండు. మేం ఇల్లు, పొలం అమ్ముకుని నడిబజార్లో తిరిపం ఎత్తుకుంటూ... ఏమైనా సరే నువ్వు కట్నం తీసుకు తీరవలసిందే"

నా మనసు కుతకుతలాడుతున్నది. తిరుగుబాటు చేసి ఇంట్లోంచి వెళ్ళిపోదామన్నంత కోపంగా ఉన్నది.

ఇప్పుడు నేను అందుకు తెగించినా నీరజ నన్ను అంగీకరిస్తుందా...

నా ఎదుట కన్నీళ్ళతో నిలబడ్డ సుశీలను చూడగానే నా ఆవేశం పాలపొంగులా చల్లారిపోయింది.

ఇది విధి వంచనా? ఆత్మవంచనా?

నేను తర్కించి తేల్చుకునేలోగా భారతి నాకు భార్యగా మా పాలిట భాగ్యదేవతలా యాభైవేల కట్నంతో నాకర గ్రహణం చేసింది. అంతేగాదు ఈ కట్నంతో ప్రమేయం లేకుండా ఉభయ పక్షాల ఖర్చులూ భరించి మా మామగారే భారీ ఎత్తున వివాహం జరిపించారు. మేం చిల్లిగవ్వ ఖర్చుపెట్టలేదు.

ఎంత అదృష్టం. మా అమ్మ నాన్నల ఆనందం ఆకాశం ఎత్తుకు ఎగిసింది. ఇంక సుశీల పెళ్ళి ఢోకాలేకుండా జరిగిపోతుంది.

వివాహం వాణిజ్య వైఖరిలో పడ్డా మనసును ద్వైధీ భావంలో పెట్టి డోలాయమానం చేసుకోవడం అవివేకం— నా మనో మందిరంలో ప్రవేశించివున్న నీరజ రూపానికి నీళ్ళొదులుకుని అక్కడ భారతిని ప్రతిష్ఠించుకున్నాను. బాహుబంధంలోనూ ఇముడ్చుకున్నాను.


కానీ నీరజ నీడ నన్ను వెన్నాడుతూనే ఉందన్న విషయం సుశీలకు పెళ్ళి నిశ్చయం అయ్యాకగానీ తెలిసిరాలేదు. అంతేగాదు ఇన్ని రోజులు నేను భారతి మీద చూపిస్తున్న ప్రేమ అంతా ఉత్తి నటనే. అన్న భావాన్ని భారతికీ కలిగించింది—

ఆ నైనం ఇదీ—

"వారేయ్ వాళ్ళు నలభై వేలకు ఒప్పుకున్నారు. ఖర్చుకని ఇరవైవేలు అదనంగా అడుగుతున్నారు" అన్నాడు నాన్న.

"నా దగ్గరేముంది నాన్నా. కోడల్నే అడగండి"

అడిగారు పాపం. అమ్మా నాన్న కలిసీ—విడివిడిగా విడమర్చి అడిగి చూశారు. కట్నం అన్న పేరుతో మా మామగారు ఇచ్చిన యాభై వేలకి ఒ చిన్న తిరకాసు మెలిపడింది— ఆ డబ్బు భారతి పేరున బ్యాంకులో వేసి పాసుబుక్కు ఆమె చేతికిచ్చారు. వివరాలు నాకు తెలియవు— భారతే కుండబద్దలు కొట్టింది.




"మా నాన్న రెండు ఖర్చులూ పెట్టుకునే గదా పెళ్ళి చేసి ఇచ్చారు. ఇంకా కట్నమేమిటి— బ్యాంకులో ఉన్నది మా సంసారానికోసం. అందులోంచి చిల్లిగవ్వ ఇవ్వను— మీరేంచేసుకున్నా సరే— ఏమనుకున్నా సరే."

"ఇలా అంటే ఎలాగమ్మా— ముహూర్తం కూడా పెట్టుకున్నాం."

"అది నా పూచీ గాదు— మీరేమన్నా చేసుకోండి"

అమ్మా నాన్న దిక్కుమొహం వేశారు. సుశీల ఏడ్పులంకించుకుంది. నేను భారతిని బతిమాలి నోరు పారేసుకోవడమే మిగిలింది. భారతి చలిస్తే ఒట్టు.

సుశీల పెళ్ళిఆగలేదు. ఎలా జరిపించారూ అన్నది వేరే విషయం— భారతి గడుసు దనానికి మాత్రం జోహార్లు చెప్పవలసిందే— భారతి తత్వం ఫలానా అని తెలిశాక ఆవిడతో ఏం మాట్లాడాలన్నా అందరికీ కంపరమే.

ఇప్పుడు మా అమ్మకు నామీద ఎనలేని జాలిపుట్టుకొచ్చింది. నాకోరోజు కాఫీ ఇస్తూ ఒరేయ్ ఈ పని (పొలం అమ్మడం) నువ్వు చెప్పినట్టు ముందే చేసి ఉంటే బాగుండేది. నువ్వైనా ప్రేమించిన పిల్లను చేసుకుని సుఖపడి ఉందువు" అతని అరవడమూ చాటు నుండి భారతి వినడమూ కూడా జరిగింది.

'శ్రీవారు శ్రీరామ చంద్రుడనుకున్నానే. పెళ్ళికి ముందు గ్రంథం నడిపించిన వారేనన్నమాట.

నేనేమీమాట్లాడలేదు.

"అయితే నన్ను డబ్బుకోసమే చేసుకున్నారన్న మాట"

"చూడు భారతీ నీ ఉద్దేశం ఏమిటోగానీ మన దేశంలో చాలా మంది ఆడవాళ్ళు డబ్బుపోసే మొగుళ్ళను కొనుక్కుంటారు. మగవాళ్ళు చాలా అమ్ముడుపోతూ ఉంటారు. నన్ను నీకు అమ్ముకున్న ఫలితం దక్కలేదని మా వాళ్ళ బాధ."

"నా మీద ప్రేమలేకుండానే ఇన్నాళ్ళూ నాతో కాపురం చేశారా"

"నీకు అలా అనిపిస్తే అదే ప్రశ్న నేను కూడా నిన్నూ అడగవలసి వస్తుంది"

"ఇంతకీ ఎవరా అమ్మాయి"

"ఎవరైతే నేం. నీ అంత కట్నం వెంట తెచ్చుకోలేని నిర్భాగ్యురాలు.

"అయ్యో పాపం నేనొచ్చి మీ సుఖం అంతా పాడు చేశానన్నమాట."

ఇదేదో చినికి చినికి గాలివాన అయ్యేట్లుగా ఉందనిపించింది. అప్పటికే బాబు ఆమె కడుపులో పడివుండడం చేత నేను బతికిపోయాను. కానీ భారతి మనసులో భావన మాత్రం అలాగే

ఉండిపోయింది.

నా ఉద్యోగపు హోదా పెరిగి హైదరాబాదు వచ్చాక భారతి ఇంటికి కావలసిన సౌకర్యాలన్నీ తన డబ్బుతోనే అమర్చుకుంది. తన తరపు వాళ్ళు ఎవరు వచ్చినా వాళ్ళ విషయం కూడా తనే చూసుకుంటుంది. అందుకే ఈ దెప్పుళ్ళు. ఆమె చేసే ఖర్చు ఊసు ఎత్తకుండా భర్త హోదాలో ఆమె పరసన చిరునవ్వు నవ్వుతూ నిలబడడమే. ఇప్పుడు భారతి నా నుండి ఆశించేది.

ఇంటర్‌కం మోగడంతో నా ఆలోచనలు వర్తమానంలోకి వచ్చేశాయి.

యండి రమ్మంటున్నాడట.

కారు ఏర్‌పోర్టు దిశగా పరుగుతీస్తున్నది.

బాబు భారతి ఒళ్ళో కూచుని ఈ చిత్ర జగత్తును విచిత్రంగా చూస్తూ బోసి నవ్వులు నవ్వుతున్నాడు.

భారతి మాత్రం వసపోసిన పిట్టలా తన కజిన్ గుణ సంపదలను గురించి వాగుతూనే ఉంది.

"రఘునందన్ బోలెడు ఆస్తి కలవాడట.అయినా ఏ మాత్రమూ గర్వం లేదుట. అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఉన్నా ఆంధ్రదేశం అంటే అంత అభిమానంట, తెలుగు సాహిత్యం అన్నా, సాంప్రదాయం అన్నా, సంగీతం అన్నా అతనికి ఎంతో ఇదిట. ఇలా 'ట'కార ప్రయోగాలుచాలా అయ్యాక అతని పెళ్ళివైనం కూడా చెప్పింది. 'ట'కారాలతోనే. లక్షలు కట్నం ఇస్తామంటూ బోలెడు సంబంధాలు వచ్చాయట. కానీ తనకెలాంటి భార్య కావాలన్నది తానే నిర్ణయించుకుని పత్రికలో ప్రకటన వేశాటడ. దాదాపు రెండు వేల అప్లికేషన్లూ, ఫోటోలు వచ్చాయట. వాటినన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించి ఈ అమ్మాయిని ఎంపిక చేసుకుని పైసా కట్నంలేకుండా పెళ్ళి చేసుకున్నాడట... అది ఘనకార్యంగా చెప్పి నాకో చురక తగిలించింది. "అతను మీలా డబ్బుమనిషికాదు' అంటూ.

"ఎవరో ఆ భాగ్యశాలిని" అడిగాను.

భారతి ఏదో చెబుతున్నది గానీ పక్కగా లారీ ఒకటి పెద్దగా రొదచేస్తూ రావడంతో నాకేమీ వినిపించలేదు.

కారుఏర్‌పోర్ట్ చేరింది.

ప్లేను వచ్చి దిగింది. అందులోంచి దిగి సతీసమేతంగా రఘునందన్ కూడా ఇవతలికి వచ్చాడు. మా కోసం ఇటూ అటూ చూస్తూ ఉంటే "రఘూ" అంటూ కేకపెట్టింది భారతి. అతడు చెయ్యినూపుతూ భార్యతో మా దగ్గరకు వచ్చాడు.

నా దృష్టి రఘునందన్ మీదే ఉన్నది. అతడచ్చం భారతి వర్ణించినట్టుగానే ఉన్నాడు. నేనతణ్ణి కొద్దిక్షణాలు పరిశీలించి నా దృష్టిని అతని భార్య మీదకు మళ్ళించాను.

మైగాడ్ నీరజ.

అడుగుల కింద అవనీతలం విచ్చుకుంటున్న అనుభూతి.

నీరజ కూడా నన్ను ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నది. క్షణం తర్వాత

"బాగున్నారా" అంటూ పలకరించింది.

రఘునందన్ భారతీ కూడా నివ్వెరపోయి మా వంక చూశారు. వారేదో అడగబోయే లోపలే నీరజ "వీరే నాతో యుగళ గీతాలు పాడింది" అంటూ భర్తకు పరిచయం చేసింది.

"కాసెట్స్‌లో మీ పాటలు విన్నానండి. మీ ఇద్దరి కంఠాలూ, మాంచి కాంబినేషన్. సింప్లీ సూపర్బ్ అండ్ మెలోడియస్.. ఐయామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్ యూ బోత్"

నీరజ అన్ని విషయాలూ అతనికి చెప్పి ఉండాలి.

అతని అభినందనలో ఆప్యాయత, అవ్యాజత కూడా గమనించాక నా మనసు తేలికపడింది.

"థాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్" నీరజా. ఈవిడ మా శ్రీమతి.

"నాకు తెలుసు" అంటూ చిన్నగా నవ్వింది నీరజ.

ఆ చూపులూ,ఆ నవ్వూ అదేవిధంగా ఉన్నా "మీరు చేసుకోక పోతేనేం నాకు మొగుడే దొరకడనుకున్నావా" అన్నట్లు తోచినై నాకు. గిల్టీ కాన్షస్.

భారతి తను తెచ్చిన బహుమతి బంగీని రఘునందన్‌కి అందించింది. రఘునందన్ దాన్ని నీరజకు అందించి బాబుని ఎత్తుకుని కాస్సేపు ముద్దాడి జేబులోంచి వందనోట్ల బొత్తినొకటి లాగి వాడి చేతిలో పెట్టాడు.


వ్యవధి గడిచిపోయింది. నీరజా రఘునందన్ మాకు టాటా చెప్పి లోపలికి వెళ్ళిపోయారు.

ప్లేను ఆకాశంలోకి ఎగిరాక మేం వచ్చి కార్లో కూచున్నాం. ఇద్దరం మౌనంగానే ఉన్నాం. బాబు నోట్లకట్ట నోట్లో కుక్కుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

కారు ఇంటి ముఖం పట్టిపోతున్నది.

"అయితే ఈవిడే సన్నమాట మీ మాజీ ప్రియురాలు"

కారుని తీసుకెళ్ళి ఏ చెట్టుకైనా గుద్దేస్తే అందరి పీడా విరగడైపోతుందన్నంత ఆవేశం వచ్చింది నాకు— ఆ ప్రయత్నంలోనే కళ్ళు మూసుకో బోయాను. ఇంతలో అంతరాంతరాల్లోంచే ఏదో అవ్యక్త శక్తంతా కదిలి పైకి వస్తున్న భావన కలిగింది.




'నా పాతికేళ్ళ నట జీవితంలో నేను సాధించింది చాలా తక్కువ. ఇంకా సాధించాల్సింది ఎంతోవుంది అన్నాడు 'నటుడు తనని ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన విలేకరితో. 'ఇంతవరకు మమ్మల్ని సాధించింది చాలు ఇకనైనా దయచేసి రిటైరవ్వండి' అని నాలక్కరుచుకున్నాడు విలేకరి.

పి.రాము,గుంటూరు

ఈమె అహంభావాన్ని ఇప్పుడే సమాధి చెయ్యకపోతే ఇంక జన్మాంతమూ నరకం అనుభవించవలసిందే.

"ముంగిలా కూర్చున్నారు. మాట్లాడరేం"

"భారతీ. నీరజ ఇప్పుడు నీకేమౌతుంది'

"వదిన"

"అయితే నాకు"

"చెల్లెలు కానీ...." అంటూ ఏదో అనబోయింది.

"ఇంక నోర్ముయ్" అంటూ గట్టిగా అరిచాను. ఆమె వంక తీక్షణంగా చూస్తూ.

ఆ అరుపు భూ—నభోంతరాలు దద్దరిల్లాయో లేదో నాకు తెలియదుగానీ భారతి గుండెలు మాత్రం దద్దరిల్లిపోయాయని దించుకున్న ఆమె చూపులే చెప్పాయి.

భారతి ఇంటికి వెళ్ళే దాకానే కాదు మళ్ళీ ఇప్పటి వరకూ ఆ ప్రసక్తి ఎత్తనేలేదు.

ఒక విషమ సమస్యకు పరిష్కారంగా జాగృతమైన ధైర్యం అది. కాస్త ఈ ధైర్యం పెళ్ళికి ముందేవుండి— "నువ్వు కట్నం తీసుకోకతప్పదురా" అన్న నాన్నను "నోర్ముయ్యండి"అని అని ఉంటే— కాదు అనగలిగి ఉంటే— ఒక్క నేనే కాదు తెలుగు గడ్డ మీద ఏ యువకుడైనా తమను అమ్మకానికి పెట్టే తల్లిదండ్రులను అనగలిగి ఉంటే చాలామంది యువత జీవితాలు మరో విధంగా ఉండేవేమో.

ఇప్పుడు మాత్రం ఇది నా విషయంలో గత జలసేతుబంధనమే—

●